## చెహోవ్ కథలు



# లోకం చూడని కన్నీరు

"హమ్మయ్య. డ్రింకు ముగిసింది. ఇంక భోజనం కావాలి"

"మరీ ఎక్కువక్కర్లేదు. కాసింత. ఖాళీ కడుపుతో నిద్రపోకుండా. పైగా యిప్పుడు అర్థరాత్రి దాటింది. పెద్దవూళ్లలో అయితే చక్కగా రాత్రంతా వూరిమీద తిరుగుతూ తింటూ, తాగుతూ గడవచ్చు. కాని ఈ దరిద్రగొట్టు వూళ్లో చీకటి పడిందంటే చాలు హోటళ్లన్నీ మూసేసుకుంటారు"

"తాగిన తర్వాత తినటం చాలా అవసరం. లేకపోతే సారా పేగుల్ని కోసేస్తుంది"

"నిజమేరా. ఏం చేద్దాం. రెండు దాటింది తెలుసా. చచ్చి గీపెట్టినా ఎక్కడా తిండి దొరకదిప్పుడు"

"కాసింత. ఒక్క చికెన్ ముక్క. ఒక మటన్ పిసరు. పోనీ ఓ పకోడీ. ఓ బజ్జీ. ఉడకపెట్టిన శనగలు..."

"లేదా చావ వేపుడు"

"అసలు యిలాంటప్పుడు తందూరీ చికెన్ లాగిస్తే చూస్కో..."

భోజనం తలుచుకుని అందరికీ నోరూరింది. ఆకలి మరింత జోరైంది.

"నిన్న నేను ఫస్ట్‌క్లాస్ మటన్‌రోస్ట్ పూరీ తిన్నాను తెలుసా"

'రెండు నెలల క్రితం నేను దక్షిణానికి వెళ్లినప్పుడు ఓ ప్రత్యేకమైన వంటకం తిన్నానోయ్. ఏమిటో తెలుసా. అక్కడ ఓ రకమైన చావ దొరుకుతుంది. దాన్ని పాలల్లో వెయ్యాలి. అలాగ చావ యిరవైనాలుగ్గంటలు పాలలో ఈత కొడతుంది. తరువాత మసాలా దట్టించి దాన్ని ఫ్రై చేస్తే... ఆహా ఏమి ఘుమ ఘుమ. ఏమి రుచి. ప్రతి మనిషి జీవితంలో కనీసం ఒక్కసారన్నా అలాంటి అనుభవం వుండాలనుకో..."

"ఒకసారి మేం వేటకెళ్లి అడవిపందిని కొట్టి, కట్టెల మీద కాల్చి తిన్నాం..."

"కాసింత ఉప్పూ, నిమ్మ రసమూ కూడా వుంటే యింక చెప్పేదేముంది..."

జ్ఞాపకాలతో ఆకలి మంటలు రగులుకున్నాయి. అందరి నోటా ఒకేమాట. తిండి. చికెన్, మటన్, చేవ, బిర్యానీ...

"సర్లెండి వెధవల్లారా. అప్పట్నించి మీకు తాగించింది నేనే కదా. ఎలాగోలా నేను ఇంత తిండి కూడా అరేంజి చేస్తాలే. తప్పుతుందా. ఈ రాత్రి బైట ఎక్కడా తిండి దొరకదు గాని, మా యింటికి రండి. ఉన్నదేదో పెడతాను. మా ఆవిడ నిద్రపోతుంటుంది. ఆమెకు మెలకువ రానివ్వకూడదు. చప్పుడు చెయ్యకుండా నా గదిలో కూర్చోండి. ఆవిడ లేసిందంటే మాత్రం అందరికీ బడితపూజ తప్పదు" అంటూ మిత్రబృందాన్ని సాదరంగా యింటికి ఆహ్వానించాడు రెబ్రోటిసోవ్.

పనిమనిషి తలుపు తియ్యగానే, తూలుతూ వచ్చిన రెబ్రోటిసోవ్, మిగతా తాగుబోతులూ లోపలికి వచ్చి కూలబడ్డారు.

"ఒరేయ్, అమ్మగార్ని లేపొద్దుగానీ, లోపలికెళ్లి కాసిని వుల్లిపాయలూ, కారట్లూ, ముల్లంగీ, దోసకాయలూ ముక్కలు చేసి కాస్త వుప్పూ, మిరియాలపొడీ చల్లి తీసుకురా" అంటూ పనిమనిషిని ఆదేశించాడు రెబ్రోటిసోవ్.

"మా ఆవిడకు ఆరోగ్యం బాగులేదు. ఆమె ఏమీ వంట చెయ్యలేదిప్పుడు. ఉన్నదాంతో సరిపెట్టుకుందాం"


లోపలికి వెళ్లివచ్చిన పనిమనిషి యజమాని చెవిలో ఏదో చెప్పాడు.

"ఓ, అలాగా, ఫరావాలేదులే. ఆవిడ కిచెన్ లాక్ చేసి తాళంచెవి దగ్గర పెట్టుకుందట. తప్పదు మరి. కిచెన్ ఓపెన్ చేసి పెట్టామనుకో, ఈ పనివాళ్లు తెల్లారేసరికి సరుకులన్నీ కాజేస్తారు. ఇప్పుడే వస్తాను" అంటూ లోపలికెళ్లి,

"ఇదిగో, నిన్నే, ఒక్క నిముషం" అంటూ పెళ్లాన్ని తట్టాడు రెబ్రోటెసోవ్

"ఏం కావాలి?"

"ఏం లేదే. నువ్వు పడుకో. ఆ తాళం చేతులొకసారిలా యివ్వు. వాళ్లకు తలా ఓ కారట్‌ముక్క పెట్టి పంపిస్తాను వెధవలకు. పాపం నన్ను నమ్ముకుని యింత దూరం వచ్చారు. పెద్దవాళ్లు, మర్యాదస్తులు... ఏదో కాస్త పార్టీ



చేసుకున్నాం. హోటళ్లు కట్టేశారు. బయట తిండి దొరకలేదు. ఆకలితో నకనకలాడిపోతున్నారు. ఉన్నదేదో కాసింతపెడితే సంతోషిస్తారు!"

"ఆహా. అవట్నించీ తప్పతాగి యిలా వచ్చారన్నమాట"

"ష్. వాళ్లు వింటారు జాగ్రత్త. నీవంటి వుత్తమ యిల్లాలు వాళ్లకేదేన్నా చేసిపెడుతుందని వచ్చారు. వాళ్లకు నువ్వు సాక్షాత్తూ అన్నపూర్ణవనుకో"

"నీకు డోసెక్కువయింది. నోర్మూసుకుని పడుకో. అర్థరాత్రి తాగుబోతుల గుంపును యింటికి తేవడానికి సిగ్గూశరం లేదా. ఇది సంసారుల కొంపా లేక... నీతోపాటు నన్ను వీధిలోకీడుస్తావా ఏమిటి. పిల్లలున్నారనే యింగితమైనా లేదు. తాగుబోతు వెధవలు..."

"ఏయ్. ఏమిటా మాటలు. అలుసిస్తే నువ్వు నెత్తికెక్కి కూర్చుంటావు. కయ్యాలమారిదానా, నీ సంగతి నాకు తెలియదా. ఒక్కనాడు ఈ యింట్లో నాకు శాంతి లేదు నాకు. నువ్వెక్కడ దాపురించావే నా ప్రాణానికి. ఏదో అడిగారు కదాని ఫ్రెండ్సుని తీసుకొస్తే యిలాగేనా సాధించటం... నీచురాలా"

"మొదలయ్యిందా రామాయణం. పగటిపూట యింటికొచ్చే మర్యాదస్తులెవరూ లేరు. అందుకని తప్పతాగి యింటికొచ్చి గోలచేస్తారు. నీకూ సిగ్గులేదు. వాళ్లకూ లేదు. ఒకరింటికి అర్థరాత్రి ఎలా వెళ్లాలా అనే జ్ఞానముందా? ఇదేనా మర్యాద"

"గయ్యాళి ముండా! ఆకలితో యింటికొచ్చిన ఫ్రెండ్సుని తిండిపెట్టక తరిమేస్తే నాకెంత అవమానం. నీ స్వభావం నాకు తెలుసే. నాకు తలవంపులు తేకపోతే నీకు తృప్తేదీ. ఇంట్లో తాచుపామును పెట్టుకున్నాను"

"హా. మొదలైనాయా శాపనార్థాలు. ఈ సంసారం తగలడ" అంటూ ఆమె లేచి కూర్చుంది.

"ఆ. పైకేమో పతివ్రతలాగ, సావిత్రీ, సీతా నాకు పోటీ అన్నట్టుగా వుంటావు. లోపలేమో..."

"నోర్మూసుకో యిక"

'నా దేవత. నా ప్రాణం. ఆ తాళం చెవి యివ్వవే...."

అలాగ భార్యాభర్తలు చాలాసేపు సాధించుకుని, తిట్టుకుని, శపించుకొని,

**రష్యన్ మూలం: చెహోవ్**

**తెలుగు గొంతు: కరుణారుణ**

వేడుకొని, ప్రాధేయపడి, ఏడ్చి, మొత్తుకొని అలసిపోయారు.

"నేను ఛస్తే గాని నీ కళ్లమంట చల్లారదులే" అంటూ ఆ యిల్లాలు లేచి వంటింట్లో కెళ్లింది.

"మా ఆవిడకు నేనంటే ఎంత ప్రేమో. మీకోసం వంట చేస్తానంది. ఒక్క నిమిషం ఓపిక పట్టండి"

"మేడం కెందుకండీ యిబ్బంది ఈ రాత్రి"

"ఫరవాలేదులే. మా ఆవిడకు నా మీదున్న గౌరవం, ఆపేక్ష అలాంటిది"

కన్నీళ్లు తుడుచుకుని, జుత్తు సరిచేసుకుంటూ హాల్లో కొచ్చి నిల్చుంది యిల్లాలు.

"సారీ మేడం. మావల్ల మీకెంత కష్టమో"

"కష్టమా. భలేవారే. మీరింటికి రావడమే నా అదృష్టం. చిటికెలో వంటయిపోతుంది. రెస్టు తీసుకోండి"

కిచెన్‌లో స్టౌ వెలిగింది. వంట ప్రారంభమైంది.

"గృహమే స్వర్గసీమ. వివాహజీవితంలో వున్న సుఖమే యిది. ఎప్పుడు, ఏవేళ యింటికెళ్లినా చక్కగా వేడివేడిగా రుచికరమైన భోజనం టేబుల్ మీద రెడీగా ఉంటుంది. భార్యలున్న వాళ్లే అదృష్టవంతులు"

ఆ రాత్రి రెబ్రోటెసోవ్ యింట్లో సుష్టుగా భోంచేసి వోటోచియెవ్ తన కొంపకు చేరుకోగానే!

"వచ్చావా. దా. ఇప్పటికి జ్ఞాపకం వచ్చిందా యిల్లు. ఛీ. మనుషులు కారు మీరు" అంటూ ఆహ్వానించింది భార్య.

"నోర్మూయ్యవే. నాలిక్కోసేస్తాను. దుర్మార్గురాలా. ఆ రెబ్రోటెసోవ్ భార్య వుందే. ఆవిడ మహాయిల్లాలు. దేవత. ఎంత ప్రేమగా, ఎంత ఓపికగా, ఎన్ని రకాల వంటలు చేసిపెట్టిందో... ఆహా. ఆదర్శ దాంపత్యమంటే అలాగుంటాయి. రెబ్రోటెసోవ్ ఎంత అదృష్టవంతుడో..." అంటూ తూలి పక్కమీద పడిపోయాడు వోటోచియెవ్.

■

